క్లుప్తంగా

నేటి నుంచి ఆధార్ మొబైల్ క్యాంపులు

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని పలు గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద నేటి నుంచి 26వ తేదీ వరకు ఆధార్ మొబైల్ క్యాంపులు నిర్వహిస్తున్నారని, అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రాజ్యలక్ష్మీ ఒక ప్రకటనలో తెలిపారు. 22న రావినూతల, తిమ్మనపాలెం, 23న పమిడిపాడు, తమ్మవరం, 24న రాచపూడి, బొడ్డువానిపాలెం, 25న కొరిశపాడు, పీ.గుడిపాడు, 26న మేదరమెట్ల, దైవాలరావూరు గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఆధార్ క్యాంపు నిర్వహిస్తామని ఎంపీడీవో తెలిపారు.

రెండు బైకులు ఢీ



గాయపడిన సాయికృష్ణ

మేదరమెట్ల: ఎదురెదురుగా వచ్చిన మోటారు బైకులు ఒకదానినొకటి ఢీకొట్టుకోవడంతో ఓవ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన కొరిశపాడు ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నందిపాడు గ్రామానికి చెందిన సింగమనేని సాయికృష్ణ రేణింగివరం నుంచి మేదరమెట్లకు మోటారు బైకుపై వస్తున్నాడు. అదే సమయంలో తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన బాషా మోటారు బైకుపై మేదరమెట్ల వైపు నుంచి తక్కెళ్లపాడు వెళ్లేందుకు రాంగ్‌రూట్‌లో బైకుపై ఇనుపరాడ్లు పెట్టుకొని వస్తున్నాడు. ఈక్రమంలో ఎదురుగా వస్తున్న బైకును ఢీ కొట్టడంతో మేదరమెట్ల వైపు వెళుతున్న సాయికృష్ణ కాలు విరిగింది. క్షతగాత్రుడిని 108 వాహనంలో ఒంగోలు కిమ్స్‌కు తరలించారు. మేదరమెట్ల పోలీసులు ప్రమాదం జరిగిన తీరును తెలుసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చందలూరు విద్యార్థినికి ప్రథమ స్థానం



విద్యార్థికి ప్రశంస పత్రం అందిస్తున్న అధికారులు

జే.పంగులూరు: అక్టోబర్ 11న అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లా స్థాయిలో 'సేవ్ ది గర్ల్ చైల్డ్' అనే అంశంపై వక్తృత్వ పోటీలు జరిగాయి. ఈపోటీలలో చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని చల్లా గాయత్రి ప్రథమ స్థానం సాధించి రూ. 5000 నగదు, ప్రశంస పత్రం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సోమవారం అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని హెచ్‌ఎం ఉపాధ్యాయులు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్, గ్రామ పెద్దలు అభినందించారు.

వ్యవసాయ కనెక్షన్లకు ప్రత్యేక ప్రాధాన్యత



గుంటుపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఈఈ

బల్లికురవ: వ్యవసాయానికి సంబంధించి రైతుల దరఖాస్తులకు ప్రత్యేక ప్రాధాన్యతలతో సత్వరమే కనెక్షన్‌లు ఇవ్వనున్నట్లు ఆశాఖ అద్దంకి ఈఈ ఎస్ మస్తాన్‌రావు తెలిపారు. సోమవారం సాయంత్రం మండలంలోని చెన్నుపల్లి, గుంటుపల్లి గ్రామాల్లో వ్యవసాయ కనెక్షన్‌లకు సంబంధించి రైతులతో సమావేశం నిర్వహించారు. ఎంతమంది దరఖాస్తులు చేశారో ఏయే దశల్లో ఉన్నాయో తెలుసుకున్నారు. ముగ్గురు, లేదా నలుగురు రైతులకు కలిపి ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో కనెక్షన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏడీఈ ఎం సురేంద్రబాబు, ఏఈ శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి రీ సర్వేలు

జే.పంగులూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిధిలోని భూ రీసర్వే జరిగిన గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నట్లు సోమవారం తహసీల్దార్ సింగారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభల వలన రీ సర్వేలో జరిగిన పొరపాట్లను సవరించడం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమాలకు మండల తహశీల్దార్, మండల సర్వేయర్, రీ సర్వే డీటీ, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, విలేజ్ సర్వేయర్, వీఆర్వో అధికారి హాజరు అవుతారని రిసర్వే జరిగిన గ్రామ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలని తెలిపారు. మంగళవారం రేణింగవరం, బుధవారం టీ కొప్పెరపాడు, గురువారం కశ్యాపురం, శుక్రవారం కోటపాడు, శనివారం అలవలపాడు, ఆదివారం చందలూరు గ్రామాలలో సభలు జరుగుతాయని పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

చీరాల అర్బన్: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జె.శ్యామల సోమవారం తెలిపారు. చీరాల ఆర్టీసీ డిపో పరిధిలోని చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లోని ప్రయాణికులు డిపో మేనేజర్ నెంబర్ 99592 25696 ద్వారా ఆర్టీసీ సర్వీసులపై సలహాలు, సూచనలు, ఫిర్యాదులు ఫోన్ ద్వారా అందించవచ్చన్నారు. ఆర్టీసీ ప్రయాణికులు సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని డిపో అభివృద్ధికి కృషి చేయాలన్నారు.



చింతగుంటపాలెం వద్ద చిల్లచెట్లతో మూసుకుపోయిన సాగర్ కాలువ



పోలూరు డొంక వద్ద రబ్బరు కాడలతో మూసుకుపోయిన కాలువ



పూనూరులో సైబన్ వద్ద కూలిన రక్షణ గోడ

నీళ్లు పారవు.. పంటలు పండవు

- చిల్లచెట్లు, రబ్బరు కాడలతో రూపుకోల్పోయిన అద్దంకి బ్రాంచ్ కాలువ
- 81,500 ఎకరాల ఆయకట్టు భూమి ప్రశ్నార్థకం
- చివరి ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు చేరని వైనం
- సాగుకే కాదు తాగునీటికి తప్పని తిప్పలు
- పట్టించుకోని ఎన్‌ఎస్పీ అధికారులు

యద్దనపూడి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనావృష్టితో ఖరీఫ్ సీజన్ తుడిచిపెట్టుకుపోయింది. పోని ఈసారి రబీలోనైనా సాగర్ నీరు వస్తాయి.. పంట పండించుకుందాం అని అనుకుంటున్న రైతన్నకు కాలువలో పిచ్చిచెట్ల రూపంలో విధి వెక్కిరించింది. నిండుకుండలా జలాశయాలు ఉన్నా కాల్వలో సరిగా నీరు పారనందున రబీ సీజన్ కూడా పోయే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నదాతలు సక్రమంగా తమ పొలాల్లో పంటలు పండించాలంటే వర్షాలు సమృద్ధిగా పడాలి. జలాశయాల్లో పూర్తిస్థాయిలో నీరు ఉన్నా ఆ నీరు సక్రమంగా పొలాలకు చేరే అవకాశం కనబడటం లేదు. సాగర్ దిగువన ఉన్న మేజర్, మైనర్ కాలువల్లో పిచ్చిచెట్లు పెరిగి నీటి ప్రవాహనికి అడ్డుపడి అడవులను తలపించటమే ప్రధాన కారణం. దీంతో శివారు ప్రాంత ఆయుకట్టుకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది.

అటకెక్కిన కాల్వ ఆధునికీకరణ పనులు..

అద్దంకి బ్రాంచ్ కాలువ (ఏబీసీ) పరిధిలో శివారు ప్రాంతమైన కోనంకి సబ్‌డివిజన్ కింద సుమారు 81,500 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. అందులో 45 వేల ఎకరాలు మాగాణి సాగుచేస్తుండగా మరో 35,500 ఎకరాల్లో మిర్చి, పత్తి, మొక్కజొన్న, శనగ, మినుము వంటి పంటలు సాగుచేస్తున్నారు. కోనంకి సబ్ డివిజన్ పరిధిలోని ద్రోణాదుల, యద్దనపూడి, కోటపాడు మేజర్లకు పది సంవత్సరాల క్రితం ఆధునికీకరణ పనుల్లో భాగంగా కాలువకట్టలకు కాంక్రీట్, లైనింగ్ నిర్మాణ పనులు చేపట్టారు. కానీ మార్టూరు మండల పరిధిలోని బొల్లాపల్లి నుంచి ఎగువన ఉన్న వలపర్ల ప్రాంతం వరకు సుమారు 12 కిలో మీటర్లు, అలాగే నూతలపాడు మైనర్ పరిధిలో 25 కిలోమీటర్ల పొడవున ఉన్న ఈ కాలువ కింద ఆధునికీకరణ పనులు చేపట్టలేదు. ముఖ్యంగా నూతలపాడు మైనర్ పరిధిలో 250 క్యూసెకుల నీటి ప్రవాహ సామర్థ్యంతో నడిచే ఈ కాలువకట్టలు ప్రస్తుతం చిల్లచెట్లతో మూసుకుపోయి నీటి ప్రవాహానికి అడుగడుగునా అడ్డుపడుతుండటంతో చివరి ఆయకట్ట భూములకు నీరు అందక పంటలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. ఈ నూతలపాడు మైనర్ కాలువ ద్వారా సాగునీరే కాక తాగునీటి అవసరాలకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా గన్నవరం, పోలూరు, జాగర్లమూడి, మున్నంగివారిపాలెం, తనుబొద్దివారిపాలెం గ్రామాల్లోని చెరువులకు నీరు నింపాల్సి ఉంది. కానీ ప్రస్తుతం కాలువల్లో ఏపుగా పెరిగిన అడవి తుమ్మచెట్లు, రబ్బరు కాడలతో నీటి ప్రవాహానికి ఆటంకంగా మారాయి. దీంతో సాగునీరే కాక, తాగునీటికి కూడా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని చివరి ఆయకట్టు రైతులు వాపోతున్నారు.

> **అవస్థలు అడుతున్నాం..**
> గత పదేళ్లుగా సాగర్ కాలువలు మరమ్మతులు చేపట్టకపోవటంతో చివరిభూములకు పూర్తిస్థాయిలో నీరు రావటం లేదు. కాలువలు మెత్తం చిల్లచెట్లతో మూసుకుపోయాయి. దీంతో రైతులందరూ చాలా ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే కాలువల్లో చిల్లచెట్లను తొలగించాలి.
> – మనుబోతు సాంబిరెడ్డి, చింతగుంటపాలెం



> **తక్షణమే మరమ్మతులు చేపట్టాలి..**
> సాగర్‌లో నీరు ఉన్నా కాలువలు సరిగ్గా లేక చివరి ఆయకట్టు భూములకు నీరు అందటం లేదు. దీంతో నిత్యం సమస్యలు ఎదుర్కొంటున్నాం. తక్షణమే ముళ్లకంపలు, పూడిక తొలగించి పంటలకు నీరు సక్రమంగా అందేలా చూడాలి.
> – చుక్కపల్లి శ్రీనివాసరావు, పూనూరు



> **ప్రతిపాదనలు పంపించాం**
> నూతలపాడు మైనర్ కాలువలో చిల్లచెట్లు తొలగించేందుకు ప్రతిపాదనలు పంపించాం. బొల్లాపల్లి నుంచి నూతలపాడు మైనర్ చివరి ఆయకట్టు వరకు సుమారు రూ. 8 లక్షల వరకు అవసరమవుతాయని ఉన్నతాధికారులకు తెలియజేశాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.
> – డీ. స్వామి, ఎన్ఎస్పీ డీఈ, కోనంకి

రాకపోకలకు అవస్థలు పడుతున్న రైతులు..

నూతలపాడు మైనర్‌కాలువ పరిధిలోని పూనూరు నుంచి చింతగుంటపాలెం, నూతలపాడు వరకు ఉన్న కాలువకట్టకు ఇరువైపులా ముళ్లపొదలతో మూసుకుపోవటంతో స్థానిక రైతులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం నుంచి దుక్కులు దున్నటం నుంచి పంటలు ఇంటికి తెచ్చుకోవాలన్నా ఈ మార్గం ద్వారానే రాకపోకలు సాగించాల్సి ఉంది. కానీ ఆ మార్గం మెత్తం చిల్లచెట్లతో మూసుకుపోవటంతో ఎరువులు, పురుగుమందులు పిచికారి ఆ దారి నుంచి వెళ్లటానికి వీలు కాకపోవటంతో ట్రాక్టర్లు, ఆటోలు నిరాకరిస్తున్నారు. ముఖ్యంగా చిల్లచెట్లు ఉండటంతో విష సర్పాలు సంచరించటంతో కూలీలు కూడా ఆ మార్గం నుంచి వచ్చేందుకు భయపడుతున్నారు. గతంలో కాలువకట్టపై ఉన్న చిల్లచెట్లను ఎప్పటికప్పుడు తొలగించేందుకు లస్కర్లు, వర్కు ఇన్‌స్పెక్టర్లు ఉండేవారు. వారు ఎప్పటికప్పుడు కాలువకట్టపై పర్యటిస్తూ చిన్నమొక్కప్పుడే వాటిని తొలగించేవారు. కానీ ప్రస్తుతం వారి నియామకం లేకపోవటంతో కాలువకట్టలపై చిల్లచెట్లు పెరిగి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, ఎన్ఎస్పీ అధికారులు సాగర్ కాలువలను మరమ్మతులు చేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

విద్యుత్ అధికారుల ఆకస్మిక దాడులు

వేటపాలెం: అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తున్న ఇళ్లపై అధికారులు దాడులు చేశారు. వేటపాలెంలో విద్యుత్ శాఖ ఈఈ జాన్ థామస్ ఆధ్వర్యంలో అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఆశాఖ అధికారులు సిబ్బంది 36 బృందాలుగా ఏర్పడి గ్రామంలో 3119 గృహాలను తనిఖీలు చేశారు. వీరిలో 76 సర్వీసులు అదనపు లోడు వినియోగిస్తున్నందుకు వారి వద్ద రూ. 3.76 లక్షలు అపరాధ రుసుం వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఈ జే శ్రీనివాసులు, చీరాల డీఈ హరిప్రసాదరావు, పర్చూరు డీఈఈ ఎస్ రమేష్, డీపీఈ డీఈఈ మల్లికార్జున పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యుత్ అధికారులు

ఎన్‌సీసీతో విద్యార్థులకు మంచి భవిష్యత్



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఎన్‌సీసీ అధికారులు

వేటపాలెం: ఎన్‌సీసీఏ సర్టిఫికెట్ ఉన్నత చదువులకు, ఆర్మీ, పోలీసులాంటి ఉద్యోగాలల్లో ఉపయోగపడుతుందని చీరాల బెటాలియన్ అధికారి సునీల్ గౌతమ్ పేర్కొన్నారు. సోమవారం పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండేళ్లుగా ఎన్‌సీసీలో శిక్షణ పొందిన విద్యార్థులకు ఎన్‌సీసీ, ఏ సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎం శేఖరరావు మాట్లాడుతూ ఎనిమిది, తొమ్మిది తరగతి విద్యార్థుల్లో ఎంపిక చేసిన కొంత మంది రెండేళ్ల సమయంలో ఎన్‌సీసీలో శిక్షణ తీసుకున్నారని తెలిపారు. అనంతరం పరీక్షల్లో పాసైన 36 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించామని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ రెండో అధికారి తోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి అంబేడ్కర్ జాతీయ పురస్కారం

అద్దంకి: తెలుగు ఉపాధ్యాయుడికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ సేవా పురస్కారం అభించింది. తనకు జాతీయ సేవా పురస్కారం దక్కినట్లు ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెల్ప్ స్వచ్ఛంద సేవా సంస్థ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సత్తెనపల్లిలోని ఐఎమ్ఏ హాల్‌లో వివిధ రంగాల్లో సేవలందించిన వారికి పురస్కారాలు అందజేశారు. దానిలో భాగంగా అద్దంకి మండలంలోని మైలవరం గ్రామ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ, పాఠశాల అభివృద్ధితోపాటు, విద్యార్థుల ఉన్నతికి పాటుపడుతున్న వంగివరపు రమేశ్‌కు అంబేడ్కర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కే బుల్లిబాబు, పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి ఎన్ రామచంద్రరావు, తెలంగాణా హైకోర్టు సూపరింటెండెంట్ పీవీపీ ఆంజనీ కుమారి, కేఎల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్‌పీ రమ్య చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. రమేశ్‌ను తోటి ఉపాధ్యాయులు అభినందించారు.



పురస్కారం అందుకుంటున్న రమేశ్

రోటరీ సేవలు అభినందనీయం

పర్చూరు (చినగంజాం): మండలంలోని కొమర్నేనివారిపాలెం ఎంపీయూపీ పాఠశాలలోని 60 మంది విద్యార్థులకు సోమవారం గొడుగులను పంపిణీ చేసినట్లు పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ తెలిపారు. రోటరీ మాజీ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో మనవరాలు జాన్విక పుట్టినరోజు సందర్భంగా బహూకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆంజనేయులు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

ఏడాది పొడవునా మజ్జిగ పంపిణీ..

చెరుకూరు గ్రామం నేరెళ్ల సుబ్బయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు విద్యా సంవత్సరమంతా మజ్జిగ పంపిణీ చేసేందుకు దాతలు ముందుకు వచ్చారు. విద్యార్థులకు ప్రభుత్వం అందించే మధ్యాహ్న భోజన పథకంలో సంపూర్ణ పోషణ అందించేందుకుగాను విద్యార్థులందరికీ మజ్జిగ పంపిణీని ప్రారంభించారు. పాఠశాల పూర్వ విద్యార్థులు, విద్యా కమిటీ సభ్యులు, అల్యుమిని అసోసియేషన్ వారి సహకారంతో విద్యార్థులందరికీ మజ్జిగ పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం టీ బెంజిమన్ హనోక్, ఎస్ఎంసీ చైర్మన్ పాలేటి శివయ్య, వైస్ చైర్మన్ షేక్ బాషా, పూర్వ విద్యార్థి కంచిబొట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.



చిన్నారులకు గొడుగులను పంపిణీ చేసిన దాతలు

జిల్లా పార్టీ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారానికి తరలిన నాయకులు

పర్చూరు (చినగంజాం): బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా నియమితులైన మాజీ మంత్రి మేరుగు నాగార్జున ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి పర్చూరు నియోజకవర్గం నుంచి సోమవారం పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. పలు వాహనాలలో పార్టీ జెండాలు కట్టుకొని బాపట్లకు అధిక సంఖ్యలో బయలుదేరి వెళ్లారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల పార్టీ కన్వీనర్లు కఠారి అప్పారావు, పఠాన్ కాలేషావలి, మున్నంనాగేశ్వరరెడ్డి, బండారు ప్రభాకరరావు, దండా చౌదరి, సీనియర్ నాయకులు కొల్లా వెంకట్రావు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీ రాంబాబు, రవీంద్రనాథ్ ఠాగూర్, ఆసోది బ్రహ్మానందరెడ్డి, గాజుల రమేష్, కోట శ్రీనివాసరావు, ఎస్ శ్రీనివాసరావు, కొల్లా శేషగిరి, కొల్లా శ్రీహరి, కట్టా రత్నరాజు, బండి రాంబాబు, గోగుల పూర్ణ, మూర్తి, జిల్లా కార్యదర్శి తమ్మా అమ్మిరెడ్డి, నక్కా పోలిరెడ్డి, ఎస్ వెంకటప్పయ్య, షేక్ బాజీ, కాల్వ అనిల్ తదితరులు ఉన్నారు.

మాంస విక్రయాలు నిలిపివేయాలని ఫిర్యాదు



సర్వోదయ కాలనీకి దగ్గరలో జరుపుతున్న మాంస విక్రయాలు

వేటపాలెం: స్థానిక సర్వోదయ కాలనీ హోలీ చర్చి దగ్గరలో నిత్యం జరుగుతున్న పశుమాంస విక్రయాలను వెంటనే నిలుపుదల చేయాలిన కోరుతూ జిల్లా కలెక్టర్‌కి కాలనీ వాసులు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ గత మూడేళ్ల కింద కొత్త కాల్వ కరకట్ట వద్ద పశువుల మాసం విక్రయాలు చేసుకోవడానికి ప్రభుత్వం అధికారుల అనుమతిచ్చారని తెలిపారు. ప్రభుత్వ అధికారుల అనుమతించిన ప్రాంతంలో కాకుండా కాలనీ వద్ద వారంలో మూడు రోజుల పాటు పశువులను వధించి వాటి మాంస విక్రయాలు చేస్తున్నారన్నారు. వాటి వాసన వల్ల పిల్లలకు వివిధ రకాల జ్వరాలు ప్రబలుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు ఏ లాజర్, పి జాలమ్మ, కే కుమారి, కే నీలాంబరం, వీ ఏసురత్నం, ఏసుబాబు పాల్గొన్నారు.

బ్యాగ్‌లోని బంగారం అపహరణ

అద్దంకి రూరల్: బ్యాగ్‌లో పెట్టుకున్న బంగారపు నానతాడును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఈఘటన సోమవారం అద్దంకి బస్టాండ్‌లో చోటుచేసుకుంది. ఈ మేరకు బాధితురాలు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి వివరాల మేరకు.. మద్దిపాడు గ్రామానికి చెందిన దయమ్మ అద్దంకి పట్టణంలోని రామాటాకీస్ బజారులోని నగల షాపులో 3 సవర్ల బంగారు నానతాడును తయారు చేయించుకొని బ్యాగ్‌లో పెట్టుకుంది. అనంతరం బస్టాండ్‌కు వచ్చి ఒంగోలు బస్సు ఎక్కింది. బస్సు బాగా రద్దీగా ఉంది. ఎవరో ఇద్దరు గుర్తుతెలియని ఆడవాళ్లు తమ వద్ద కొంత సేపు నిలబడి బస్సు వెళ్లిపోయారు. బస్సు కదిలి బస్టాండ్ నుంచి బయటకు రాగానే సంచిలోని బంగారపు తాడును చూసుకోగా పర్సు లేకపోవటంతో అనుమానంతో దిగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్సై ఖాదర్‌బాషా కేసు నమోదు చేశారు.

రేపటి నుంచి గ్రామసభలు

యద్దనపూడి: గతంలో రీసర్వే చేసిన గ్రామాల్లో ఈనెల 23 నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న గన్నవరం, 24న వింజనంపాడు, 25న జాగర్లమూడి, 26 యద్దనపూడి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి రైతుల సమస్యలు పరిష్కరిస్తారన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రీ సర్వేలో జరిగిన పొరపాట్లను సవరించడం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమాలకు మండల తహశీల్దార్, మండల సర్వేయర్, రీ సర్వే డీటీ, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, విలేజ్ సర్వేయర్, వీఆర్వో అధికారి హాజరు అవుతారని తెలిపారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, ఆశ్వీయూజ మాసం ఆరుద్ర నక్షత్రం, సప్తమి తిథి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్

పోలీసుల సేవలు అజరామరం

చీరాల టౌన్: అమలులైన పోలీసులను స్మరించుకోవడం అందరి బాధ్యత.. ప్రజలు ప్రశాంతంగా ఉండేందుకు నిరంతరం పోరాడుతున్న పోలీసులు చేస్తున్న సేవలు అజరామరమని మెరైన్ ఎస్సై పసుపులేటి సుబ్బారావు అన్నారు. పోలీసు అమరువీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కొత్తపట్నం మెరైన్ పోలీస్ స్టేషన్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించి అమరులైన పోలీసులకు ఘనంగా నివాళులర్పించారు. పోలీసు అమరువీరుల దినోత్సవం సందర్భంగా ఇటీవల వాడరేవు సముద్ర తీరంలో కొట్టుకుపోతున్న పర్యాటకుడు బాషాను తమ ప్రాణాలకు తెగించి కాపాడిన హోంగార్డు శ్రీను, గజ ఈతగాళ్లను నగదు, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు పోలీసులు, సిబ్బంది ఉన్నారు.



హోంగార్డు శ్రీనును జ్ఞాపికతో సత్కరిస్తున్న మెరైన్ ఎస్సై

ఆటో డ్రైవర్లకు ఐడీ కార్డులు అందజేత

అద్దంకి రూరల్: పట్టణంలోని ప్రసన్నాంజనేయ నేస్తమా ఆటోయూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఆటో డ్రైవర్లకు ఎస్సైలు ఖాదర్‌బాషా, ప్రవీణ ఐడీ కార్డులు, పీసీ నంబర్లను అందజేశారు. డ్రైవర్లు యూనిఫామ్ ధరించాలని, పట్టణంలో స్టాండ్‌లో ఆటోలు నిలపాలన్నారు. మద్యం సేవించి ఆటోలు నడపవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ ప్రెసిడెంట్ నాగిపోగు చక్రవర్తి, వైఎస్ ప్రెసిడెంట్ దాసరి బుల్లియ్య, అణ్యం నాగేశ్వరరావు, సెక్రటరీ సురభి రాంబాబు, దొండపాటి రాజా తదితరులు పాల్గొన్నారు.



ఐడీ కార్డులు, పీసీ నంబర్లు అందజేస్తున్న ఎస్సైలు

మురళీకృష్ణ అభినందనీయుడు

చీరాల రూరల్: చీరాల ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా నియామకం పొందిన వాకర్స్ అసోసియేషన్ గౌరవ సలహాదారుడు వలివేటి మురళీకృష్ణను సోమవారం హైస్కూలు క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ మాట్లాడారు. మురళీకృష్ణ గీతా సర్వీసు ట్రస్టును ప్రారంభించి ఎంతోమంది విద్యార్థులకు చేయూతనివ్వడమే కాకుండా దేశవ్యాప్తంగా యువ సైంటిస్టులను తయారు చేశారని కొనియాడారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా సమాజసేవలు అందించారని, బాపట్ల, ప్రకాశం జిల్లాలోని అనేక గ్రామాలలో ప్రజల సౌకర్యార్థం 285 సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారని, ఆర్యవైశ్య ఎక్స్ అఫిషియల్స్ సంస్థకు ప్రతినిధిగా కొనసాగుతూ రూ. 10 లక్షలతో యువతకు కంప్యూటర్లు ఏర్పాటు చేసిన ఘనత మురళీకృష్ణకే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు చారుగుళ్ల గురుప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్ చీమకుర్తి బాలకృష్ణ, డివి. సురేష్, మధుసూదనరావు, కె. వీరాంజనేయులు, డి. తిరుపతిరావు, రమేష్, ఎ. వీరాంజనేయులు, చెన్ననారాయణ, డాక్టర్ నాగేశ్వరరావు, దరియా సాహెబ్, లాల్, భాస్కరరావు, రవి, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



మురళీకృష్ణను సత్కరిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

చీరాల డివిజన్
90101 55593 (చీరాల)

Office mail : sakshiongads@gmail.com